

# షాడో సర్పంచ్..
# నీడలోనే పాలన..!

5 లో..

- ప్రజాజ్యోతి కథనం అక్షర సత్యమని ప్రజల అభిప్రాయం
- పంచాయతీల్లో అధికార దుర్వినియోగంపై కొత్త ఆరోపణలు
- కార్యదర్శులపై ఒత్తిడి... స్థానిక వర్గాల్లో ఆందోళనలు
- పనులు లేకపోయినా బిల్లులు అన్న గ్రామస్థుల వాదనలు
- ఫోటోలు, జీపీఎస్ వివరాల్లో గందరగోళంపై సందేహాలు

పాల్వంచ మండలంలోని గ్రామపంచాయతీలలో 'బినామీ సర్పంచ్' వ్యవస్థపై ప్రజా జ్యోతి వెలుగులోకి తెచ్చిన **"కుర్చీ ఆమెదే... పెత్తనం ఆయనది"** కథనం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ కథనాన్ని ప్రజలు "అక్షర సత్యం"గా అభివర్ణిస్తుండగా, తాజా పరిణామాలు ఆ ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. సర్పంచ్‌ల పేరుతో అధికారాలు వినియోగిస్తున్న **'సర్పంచ్ పతులు'** గ్రామ పరిపాలనను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారనే విమర్శలు ముదురుతున్నాయి.

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి / పాల్వంచ, ప్రజాజ్యోతి

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 18 | మార్చి | 2026 ◆ పేజీలు : 7



# ఆక్రమిస్తాం..
# అడ్డుకునేదెవరు..!!

2 లో..

- ఫుట్‌పాత్‌లపై ఫుల్ బిజినెస్
- అధికారుల ఆదేశాలు బొత్తిగా పట్టించుకోరా!
- డ్రైనేజీలపై దుకాణాలు... మెయిన్ రోడ్లపై ఆక్రమణల మోత
- నోటీసులు ఇచ్చినా మారని వ్యాపారులు...
- కఠిన చర్యలే మార్గమా!
- రెడ్ కార్పెట్ లా అధికారుల నోటీసులు
- అధికారులు జర దృష్టి సారించరూ!

ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో అధికారుల ఆదేశాలు పూర్తిగా భేఖాతర్ అవుతున్నాయి. ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీలు ప్రజల సౌకర్యం కోసం ఉన్నా, అవి ప్రస్తుతం వ్యాపారాల కేంద్రాఇలుగా మారిపోయాయి. ముఖ్యంగా మెయిన్ రోడ్లలో, ఆమ్ బజార్ ప్రాంతంలో ఫుట్‌పాత్‌లపై దుకాణాలు, డ్రైనేజీలపై కబ్జాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. నోటీసులు ఇచ్చినా వ్యాపారులు తమ పంథాను మార్చకపోవడం గమనార్హం.

- ఇల్లందు, ప్రజాజ్యోతి

## భద్రాచలంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందడి

- శ్రీ సీతారాముల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు




**భద్రాచలం, మార్చి 17, ప్రజాజ్యోతి:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందడి మొదలైంది. మరో రెండు రోజుల్లో ఉత్సవాలు ప్రారంభం కానుండగా, శ్రీ సీతారాముల కల్యాణ

మిగతా 2 లో...

## శ్రీరామనవమి ఉత్సవాలకు సమగ్ర ఏర్పాట్లు చేయాలి

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 17, ప్రజాజ్యోతి:** శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు రెవెన్యూ, పోలీసు, దేవస్థానం మరియు ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులు, వీఐపీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పి రోహిత్ రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐటీడీఏ పీఓ రాహుల్, శిక్షణా కలెక్టర్ సౌరభ్ శర్మ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఏఎస్పీ విక్రాంత్ సింగ్, దేవస్థానం ఈఓ దామోదర్ రావు తదితరులతో కలిసి కలెక్టర్ ఏర్పాట్ల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సీతా రామచంద్రస్వామి కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలు జిల్లాకు ప్రతిష్టాత్మకమైనవని, వీటిని అత్యంత శ్రద్ధతో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.ఆలయ పరిసరాలను సుందరంగా అలంకరించడంతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రధాన రహదారులు, ఆలయ మార్గాల్లో శుభ్రతను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. భక్తులకు తగినంత తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆహార భద్రత అధికారులు హోటళ్లు, అన్నదాన కేంద్రాల్లో నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ

మిగతా 2 లో...

# భద్రాచలంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందడి



(మొదటి పేజీ తరువాయి...)

మహోత్సవానికి దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని భద్రగిరి వీధులు స్వాగత ద్వారాలు, విద్యుత్ అలంకరణలు, పుష్పాలతో సుందరంగా ముస్తాబవుతున్నాయి. ఈ నెల 27న శ్రీ సీతారాముల కల్యాణం, 28న పట్టాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో మిథిలా స్టేడియంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. షామియానాలు, సీటింగ్ ఏర్పాట్లు, వీఐపీ విభాగాల విభజన, భద్రతా బారికేడ్ల ఏర్పాటు పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

**బ్రహ్మోత్సవాల షెడ్యూల్...**

ఈ నెల 19న ఉగాది పర్వదినం సందర్భంగా బ్రహ్మోత్సవాలు అంకురార్పణ, రక్షాబంధనం, స్నపన తిరుమంజనం వంటి పూజలతో ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగనున్నాయి. మార్చి 19: అంకురార్పణ, మృత్సంగ్రహణం మార్చి 24: గరుడధ్వజపటావిష్కరణ మార్చి 25: ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ట మార్చి 26: వాహన సేవలు, ఎదుర్కోలు ఉత్సవం మార్చి 27: ఉదయం 10:30 నుంచి 12:30 వరకు శ్రీ సీతారాముల కల్యాణం మార్చి 28: పట్టాభిషేకం, రథోత్సవం మార్చి 30: తెప్పోత్సవం ఏప్రిల్ 2: పూర్ణాహుతి, ధ్వజావరోహణంతో ముగింపు

**భక్తుల రద్దీకి ఏర్పాట్లు**

భక్తుల రద్దీ దృష్ట్యా తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య శిబిరాలు, భద్రతా చర్యలను పటిష్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తిశ్రద్ధల మధ్య జరిగే ఈ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు దేవస్థానం అధికారులు అన్ని విధాలుగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# శ్రీరామనవమి ఉత్సవాలకు సమగ్ర ఏర్పాట్లు చేయాలి



(మొదటి పేజీ తరువాయి...)

చేయాలని తెలిపారు. వైద్య శాఖ అధికారులు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఏరియా ఆసుపత్రిలో అదనంగా 30 పడకలను సిద్ధంగా ఉంచాలని, దర్శన మార్గాల్లో ప్రాథమిక చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల కోసం అంబులెన్స్ వాహనాలు, రక్త నిల్వలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. రవాణా శాఖ అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని, ఆర్టీసీ అధికారులు భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు నడపాలని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించడంతో పాటు ప్రత్యామ్నాయంగా జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని, అగ్నిమాపక శాఖ అధికారులు అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. భద్రతా పరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పి రోహిత్ రాజు సూచించారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించడంతో పాటు సెక్టార్ వారీగా భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తళంబ్రాల సమయంలో భక్తుల రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాల సమయంలో శాంతిభద్రతల దృష్ట్యా అవసరమైన నియంత్రణ చర్యలు అమలు చేయాలని పేర్కొన్నారు. అనుమతులు లేని ఫ్లెక్సీలు తొలగించి ఆధ్యాత్మిక వాతావరణానికి అనుగుణంగా మాత్రమే ప్రచార సామగ్రి ఉండేలా చూడాలని, పంచాయతీ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలని అధికారులకు సూచించారు. అనంతరం మిథిలా స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లు, మాడవీధులను పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఉత్సవాల నాటికి అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఆక్రమిస్తాం.. అడ్డుకునేదెవరు..!!

- ఫుట్‌పాత్‌లపై ఫుల్ బిజినెస్
- అధికారుల ఆదేశాలు బొత్తిగా పట్టించుకోరా!
- డ్రైనేజీలపై దుకాణాలు... మెయిన్ రోడ్లపై ఆక్రమణల మోత
- నోటీసులు ఇచ్చినా మారని వ్యాపారులు...
- కఠిన చర్యలే మార్గమా!
- రెడ్ కార్పెట్ లా అధికారుల నోటీసులు
- అధికారులు జర దృష్టి సారించరూ!

ఇల్లందు, ప్రజాజ్యోతి

**ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో అధికారుల ఆదేశాలు పూర్తిగా భేఖాతర్ అవుతున్నాయి. ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీలు ప్రజల సౌకర్యం కోసం ఉన్నా, అవి ప్రస్తుతం వ్యాపారాల కేంద్రాఇలుగా మారిపోయాయి. ముఖ్యంగా మెయిన్ రోడ్లలో, ఆమ్ బజార్ ప్రాంతంలో ఫుట్‌పాత్‌లపై దుకాణాలు, డ్రైనేజీలపై కబ్జాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. నోటీసులు ఇచ్చినా వ్యాపారులు తమ పంథాను మార్చకపోవడం గమనార్హం.**

**››› ఫుట్‌పాత్, డ్రైనేజీల్లో నిబంధనలు!**

మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీలపై ఎలాంటి వ్యాపారాలు చేయరాదు. అయితే ఇల్లందులో పరిస్థితి పూర్తిగా విరుద్ధంగా కనిపిస్తుంది. కొన్ని సంవత్సరాలుగా వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకుని నిరభ్యంతరంగా వ్యాపారం కొనసాగిస్తున్నారు.



ప్రత్యేకంగా ఆమ్ బజార్, మెయిన్ రోడ్లలో డ్రైనేజీలపై కబ్జాలు పెరిగిపోయాయి.

**››› రద్దీలోనే వ్యాపారాలు**

ఇల్లందు మెయిన్ రోడ్డు, ఆమ్ బజార్‌లో వివిధ వ్యాపారాలు కొనసాగుతున్నడంతో నిత్యం ప్రజలతో ఆ ప్రాంతం రద్దీగా ఉంటుంది. మరో వైపు వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. గత మున్సిపల్ పాలకవర్గం మెయిన్ రోడ్డు వెంబడి పాదాచారుల కోసం ఫుట్ పాత్ ను ఏర్పాటు చేశారు. ప్రధాన రోడ్డు వెంబడి రహదారిని అనుకొని ఉన్న ఆ ఫుత్ పాత్ పై వ్యాపారస్తులు ఆక్రమించుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దుకాణాలు రహదారిపైకి చొచ్చుకొని రావడం, పాదాచారులకు నడిచే దారి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల రహదారిపైకి వచ్చే వాహనాలు వేగంగా వెళ్లడం వల్ల అరపాదడప ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మెయిన్ రోడ్డులోని కూరగాయల మార్కెట్ వద్ద ప్రతిరోజు పదుల సంఖ్యలో ఆటోలతోపాటు వివిధ వాహనాలు నిలపడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్ పాత్, డ్రైనేజీలపై వ్యాపారాలు కొనసాగించే వారికి మున్సిపల్ అధికారులు నోటీసులతోపాటు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ వారిని బేఖాతర్ చేస్తూ వారి వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మెయిన్ రోడ్డు ఫుట్ పాత్, ఆమ్ బజార్ డ్రైనేజీలను ఆక్రమించుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఫుట్ పాత్, డ్రైనేజీలపై వ్యాపారాలు చేస్తే చర్యలు తీసుకుంటాం: గణేష్, కమిషనర్, ఇల్లందు మున్సిపాలిటీ

ఇల్లందు మున్సిపాలిటీ లోని మెయిన్ రోడ్డు ఫుట్ పాత్, ఆమ్ బజార్ డ్రైనేజీలపై వ్యాపారాలు కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మెయిన్ రోడ్డు ఫుట్ పాత్, ఆమ్ బజార్ డ్రైనేజీలపై వ్యాపారాలు చేసే వారిని గుర్తించి నోటీసులు ఇచ్చాం. ఫుట్ పాత్, డ్రైనేజీలపై వ్యాపారాలు కొనసాగించవద్దు. నిబంధనల మేరకు మాత్రమే వ్యాపారాలు చేసుకోవాలి.

# ఎకరానికి రూ 24 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి: అన్నవరపు సత్యనారాయణ

**ములకలపల్లి మార్చి 17, ప్రజాజ్యోతి:** సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటర్ కాలువల కోసం భూమి సేకరణ జరుగుతున్న నేపథ్యంలో భూనిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఎకరాకు రూ 24 లక్షల నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ములకలపల్లిలో తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనరసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎకరానికి రూ.24 లక్షలు పరిహారం ఇవ్వాలని కోరారు. గతంలో ప్రధాన కాలువకు కేవలం రూ.8 లక్షలు మాత్రమే చెల్లించారని, ఖమ్మం ప్రాంతంలో మాత్రం రూ.18 నుంచి రూ.24 లక్షలు వరకు ఇస్తున్నారని పేర్కొన్నారు. భూముల మార్కెట్ విలువ రూ.20 లక్షలకు పైగా ఉన్నప్పటికీ తక్కువ ధరకు కొనుగోలు చేయడం అన్యాయమని అన్నారు. పెరిగిన ఖర్చులను దృష్టిలో ఉంచుకుని మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన తర్వాత మిగతా ప్రాంతాలకు నీరు సరఫరా చేయాలని సూచించారు. బడ్జెట్ సమావేశాల్లో డిస్ట్రిబ్యూటర్ కాలువలకు పూర్తి నిధులు కేటాయించి పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్, నాయకులు గోపగాని లక్ష్మీనర్సయ్య, వర్షా శ్రీరాములు, కురం ప్రభాకర్, ప్రసాదు, నారాయణ, భూక్యా శ్రీదేవి, పుప్పాల హరినాథ్, హేమాని తదితరులు పాల్గొన్నారు.



# భద్రాచలంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం

- ఐదు వేల కుటుంబాలకు నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యం





**భద్రాచలం, మార్చి 17, ప్రజాజ్యోతి:** భద్రాచలం ఐటీడీఏ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న కాలనీలకు మెరుగైన విద్యుత్ సౌకర్యాలు కల్పించేందుకు 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడుతున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు.మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియం వెనుక ఉన్న సుమారు 30 కుంటల ఖాళీ స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటీడీఏ పరిధిలోని శివారు కాలనీలలో లో వోల్టేజ్ సమస్యల కారణంగా గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు దెబ్బతింటున్నాయని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు.విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపడుతున్న ఈ సబ్‌స్టేషన్ ఐదు నెలల్లో పూర్తవుతుందని చెప్పారు. నిర్మాణం పూర్తయిన తర్వాత పట్టణం మరియు శివారు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు గణనీయంగా తగ్గి, సుమారు 5 వేల కుటుంబాలకు నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఈ. మహేందర్, భద్రాచలం డివిజనల్ ఇంజనీర్ కె. జీవన్ కుమార్, కన్స్ట్రక్షన్ డీఈ వెంకటేశ్వర్లు, అలాగే విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## 18న ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య భద్రాచలం పర్యటన



**భద్రాచలం, మార్చి 17, ప్రజాజ్యోతి** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఈ నెల 18 నుంచి 20 వరకు మూడు రోజులపాటు భద్రాచలంలో పర్యటించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం దుమ్ముగూడెం మండలం పర్ణశాలలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని దర్శించుకుంటారు. అనంతరం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియాన్ని సందర్శిస్తారు. అదే రోజు రాత్రి ఐటీసీలో బస చేయనున్నారు.19న ఉదయం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పాపికొండల సందర్శనకు బయలుదేరుతారు. పాపికొండల పర్యటన అనంతరం తిరిగి భద్రాచలానికి చేరుకుని రాత్రి ఐటీసీలో బస చేస్తారు.20న ఉదయం హైదరాబాదుకు తిరిగి ప్రయాణమవుతారని ఐటీడీఏ పీవో రాహుల్ తెలిపారు.


## సర్పంచ్ ల సంఘం జిల్లా అధ్యక్షునిగా కిషోర్ నాయక్ ఎన్నిక



**బూర్గంపహాడ్, మార్చి 17 (ప్రజా జ్యోతి):** సర్పంచ్ ల సంఘం జిల్లా అధ్యక్షునిగా బూర్గంపహాడ్ మండల పరిధిలోని మేజర్ పంచాయతీ సారపాకకు చెందిన గుగులోత్ కిశోర్ శివరాంనాయక్ ఎన్నికయ్యారు. మంగళవారం భద్రాచలంలో జరిగిన రాష్ట్ర సర్పంచ్ ల సంఘం సమావేశంలో రాష్ట్ర సంఘం బాధ్యులు ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సారపాక పంచాయతీ నుంచి భారీ మెజార్టీతో సర్పంచ్ గా గెలుపొందిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ సందర్భంగా కిషోర్నాయక్ మాట్లాడుతూ తనపై మరింత బాధ్యత పెరిగిందని, రాష్ట్ర సంఘం ఇచ్చిన ఈ పదవికి వన్నెతెచ్చేలా జిల్లాలో సర్పంచ్లు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంలో తనవంతు పాత్ర పోషిస్తానని, ఎలాంటి సమస్యలున్నా రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషిచేస్తానని పేర్కొన్నారు. సర్పంచ్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ ఎన్నికయ్యారు. సమావేశం అనంతరం జిల్లా సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు కిషోర్ నాయక్, ఉపాధ్యక్షుడు పూనెం కృష్ణలకు పలువురు సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

## సహజ వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి బాబురావు



**భద్రాచలం, మార్చి 17, ప్రజాజ్యోతి:** రైతులు సహజ వ్యవసాయ పద్ధతులను అవలంబించి ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు నేల సారాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బాబురావు సూచించారు.మండలంలోని పర్ణశాల రైతు వేదికలో మంగళవారం సహజ వ్యవసాయంపై ఒకరోజు అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు సహజ వ్యవసాయ పద్ధతులు, వాటి ప్రయోజనాలు, ఖర్చు తగ్గింపు మార్గాలు, నేల ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై అధికారులు వివరించారు.ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న రైతులకు అవసరమైన కిట్లను పంపిణీ చేశారు. సహజ వ్యవసాయం ద్వారా పంట దిగుబడులు మెరుగుపడటంతో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు.రైతులు రసాయనాలపై ఆధారపడకుండా సహజ పద్ధతులను అనుసరించి స్థిరమైన వ్యవసాయం వైపు ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## రైతులు అధికంగా యూరియా వాడితే కలిగే నష్టాలు



**ఇల్లందు, మార్చి 17, ప్రజాజ్యోతి:** రైతులు పంటలకు అధికంగా యూరియా వాడితే నష్టాలు వస్తాయని ఏడిఏ జి లాల్ చంద్ అన్నారు. మంగళవారం మండలంలోని కొమరారం రైతువేదికలో నానో యూరియా నానో డిఏపి, ప్రకృతి వ్యవసాయం, నూనె గింజల సాగు యొక్క ప్రాముఖ్యత గురించి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా నానో డిఏపి, ఆయిల్ ఫామ్ పంట ప్రాముఖ్యత ఎంతో ఉందని తెలిపారు. ఒక టన్ను గెల సుమారుగా 22 వేల రూపాయలు ఉంటుందని పేర్కొన్నారు. ఇల్లందు మండలంలో 217 ఎకరాల పైచిలుకు ఆయిల్ పామ్ పంట పడిందని, ఇకపై కూడా ఈ పంటకు రైతులు ఎక్కువ మొగ్గు చూపాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రసానిక ఎరువులు కాకుండా సేంద్రీయ ఎరువులు వాడటం ద్వారా తక్కువ ఖర్చుతో పంటలను లాభసాటిగా పండించవచ్చని, భూసారం పెరిగి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ పి సతీష్, ఆత్మ చైర్మన్ బోడ మంగీలాల్, ఏఈఓ యశ్వంత్, ఆత్మ సిబ్బంది ప్రవీణ్, వంశీ, రైతు సోదరులు పాల్గొన్నారు.

## ఈఎస్ఐలో అందని వైద్యం...అవస్థ పడుతున్న కార్మికులు

- ఈఎస్ఐ డిస్పెన్సరీ వద్ద కాంట్రాక్టు కార్మికుల నిరసన



**బూర్గంపహాడ్, మార్చి 17 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని సారపాక గ్రామంలో ఈఎస్ఐ ఆసుపత్రిలో వైద్యం సకాలంలో అందక... కనీస సౌకర్యాల కొరతతో కార్మికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. కార్మికులకు ఈఎస్ఐ ద్వారా 24 గంటలు వైద్యం అందించడంతో పాటు అవసరమైన మందులు కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఈఎస్ఐ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు కార్మిక సంఘం జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో-కన్వీనర్ సాని కొమ్ము రామచంద్రారెడ్డిలు మాట్లాడుతూ డిస్పెన్సరీలతో మందులు, వైద్యులు అందుబాటులో లేకపోవడంతో కార్మికులకు ఆరోగ్యపరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అత్యవసర సమయాల్లో వినియోగించాల్సిన అంబులెన్స్ సౌకర్యం కూడా లేకపోవడం దారుణమన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి డిస్పెన్సరీలో మెరుగైన వైద్యసేవలు అందించేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మిక సంఘాల సభ్యులు ఉర్లగొండ వీరన్న, కందాల వెంకటరెడ్డి, జగదీష్, సీహెచ్ ఆంజనేయులు, కె.నాగయ్య, చుక్కపల్లి బాలాజీ, కాంట్రాక్టు కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## సింగరేణి సబ్‌స్టేషన్ లో ఆధునిక లైటింగ్ వ్యవస్థ

- ప్రారంభించిన సెంట్రల్ వర్క్ షాప్ జీఎం దామోదర్ రావు




**కొత్తగూడెం సింగరేణి, మార్చి 17 – ప్రజాజ్యోతి:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ పరిధిలోని 132 కేవీ సబ్‌స్టేషన్ కార్పొరేట్ వద్ద నేమ్ బోర్డ్, యార్డ్ ప్రాంతం కాంతివంతంగా ఉండే విధంగా ఆధునిక లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి సెంట్రల్ వర్క్ షాప్ జనరల్ మేనేజర్ ఎన్ దామోదర్ రావు చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ ... సబ్‌స్టేషన్ వంటి కీలక స్థలాల్లో సముచితమైన వెలుతురు ఉండటం ద్వారా పనివారికి స్పష్టమైన దృశ్యమానత లభించి, ప్రమాదాలను నివారించడంలో ముఖ్య పాత్ర పోషించడమే కాకుండా పనులు మరింత సమర్థవంతంగా చేయగలరని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ లైటింగ్ సిస్టమ్, ఎల్ఈడి నేమ్ బోర్డ్ సదుపాయం ద్వారా సేఫ్టీ ప్రమాణాలు మరింత బలోపేతం అవుతాయని చెప్పారు. అలాగే ఆధునిక ఎల్ఈడి లైటింగ్ వినియోగం ద్వారా విద్యుత్ వినియోగం తగ్గి, పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సింగరేణి సంస్థలో సేఫ్టీ, ఆధునిక సాంకేతికతకు ఇచ్చే ప్రాధాన్యతకు నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు, కే.వేలాద్రి, ఉమామహేశ్వర రావు, నరేష్, నాయకులు రమణమూర్తి, పీతాంబరం, ,ప్రభాకర్ పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలలో నాల్గవతరగతి ప్రవేశానికి మండలస్థాయి ఎంపికలు



**బూర్గంపహాడ్, మార్చి 17 (ప్రజా జ్యోతి):** హకీంపేట క్రీడా పాఠశాలకు నాల్గవ తరగతి ప్రవేశాల నిమిత్తం మండల కేంద్రంలోని బూర్గంపహాడ్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 20వ తేదీన మండల స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో యదుసింహరాజు మంగళవారం తెలిపారు. tgss.telangana.gov.in వెబ్సైట్లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు 20న ఉదయం 8.30 గంటలకు ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల క్రీడా మైదానానికి చేరుకోవాలని సూచించారు. క్రీడా ఎంపికకు హాజరయ్యే విద్యార్థులు 3వ తరగతి చదివిన స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్, క్యాస్ట్ సర్టిఫికెట్లతో పాటు ఆరు పాస్పోర్టు సైజు ఫోటోలతో రావాలని కోరారు. ఈ క్రీడా ఎంపికలు వ్యాయామ ఉపాధ్యాయులు బి.కృష్ణ, సాగర్, పూర్ణల పర్యవేక్షణలో జరుగుతాయని, పూర్తి వివరాలకు 9032324982 ను సంప్రదించాలని కోరారు.

# సూర్య గ్యాస్ ఏజెన్సీని ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్

- నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ అమ్మ కూడదు.
- ప్రభుత్వం నిర్ణయించిన ధరకే గ్యాస్ అమ్మాలి.

**సుజాత నగర్ ప్రజాజ్యోతి మార్చి 17:** భద్రాద్రికొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి డి.వేణుగోపాల్ మంగళవారం సుజాతనగర్‌లోని ఎంఎస్ సూర్య గ్యాస్ ఏజెన్సీ గోదాం, కార్యాలయంను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాంలో ఉన్న ఎల్పీజీ సిలిం



డర్ల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బుకింగ్, పంపిణీ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు.తనిఖీ అనంతరం ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు ఎల్పీజీ రీఫిల్ సిలిండర్లను సీనియారిటీ క్రమంలోనే పారదర్శకంగా అందజేయాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరగకూడదని,ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అమ్మాలని నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో గ్యాస్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. గ్యాస్ సరఫరాలో ఆలస్యం, అక్రమాలు, డెలివరి చార్జీలు ఏమైనా ఫిర్యాదులు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ తనిఖీలో సంబంధిత విభాగాల అధికారులు, ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈద్గా స్థలాన్ని సందర్శించిన చైర్ పర్సన్



**ఇల్లందు టౌన్, మార్చి 17, ప్రజాజ్యోతి:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా ప్రార్ధనలు చేసేటువంటి 16వ వార్డులో బైపాస్ రోడ్డు ప్రక్కన గల ఈద్గా స్థలాన్ని మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ పరిశీలించారు. ఈద్గా వద్ద ఏర్పాట్లు, పరిశుభ్రత, భద్రతా చర్యలపై అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ సందర్భంగా ప్రార్ధనలు సాఫీగా, శాంతియుత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రార్ధనలకు వచ్చే ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సదుపాయాలు కల్పించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ డానియల్, 16, 18వ వార్డు కౌన్సిలర్ ఉల్లింగ విజయలక్ష్మి సతీష్, మహమ్మద్ జాఫర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జానంపేటలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు



**పినపాక,మార్చి 17(ప్రజాజ్యోతి ):** పినపాక మండలం జానంపేట గ్రామంలో రైతులకు సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం కొనసాగించేలా ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ సహాయ అధికారి తాతారావు ముఖ్య అతిథిగా హాజరై సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవచ్చని, సేంద్రియ పద్ధతులు రైతులకు దీర్ఘకాలంలో లాభదాయకమని తెలిపారు.సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించే పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో పాటు, ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని ఆయన వివరించారు. రైతులు సహజ వనరులను వినియోగిస్తూ తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే అవకాశాలు ఉన్నాయని సూచించారు.ఈ సందర్భంగా ఇప్పటికే సేంద్రియ వ్యవసాయం చేపడుతున్న రైతులను అభినందిస్తూ శాలువాలతో సన్మానించారు. వారి అనుభవాలను ఇతర రైతులతో పంచుకునేలా ప్రోత్సహించారు.గ్రామంలోని మరిన్ని రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలని అధికారులు కోరారు.కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ఏఈవోలు, స్థానిక సర్పంచ్ ఉమా మహేశ్వరి, మల్లారం సర్పంచ్ ఇర్పా సాంబశివరావు, అమరారం సర్పంచ్ ప్రసాద్,స్థానిక రైతులు పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్‌ను కలిసిన కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 17, ప్రజా జ్యోతి:** భద్రాచలం పర్యటనలో భాగంగా జిల్లాకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఐటీసీ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మొక్కను అందజేసి న్యాయమూర్తికి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు గురించి సంక్షిప్తంగా వివరించారు. జిల్లా అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను న్యాయమూర్తికి తెలియజేసినట్లు అధికారులు తెలిపారు.

## ముస్లిం పెద్దలకు తోఫా అందజేసిన చైర్ పర్సన్





**ఇల్లందు, మార్చి 17, ప్రజా జ్యోతి:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు అందజేసే తోఫా ను మంగళవారం పెద్ద మసీదులో మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ ముస్లిం పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలకు తోఫా అందజేయడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం అన్ని మతాల వారికి సరైన ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పెండెల రాజు, ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్, డిటి కిషోర్, కౌన్సిలర్లు రాధ కమల్ కోరి, ఉల్లింగ విజయలక్ష్మి, నేరుడు ఉపేంద్ర, చేనిగరపు శృతి, చిల్లా విజయ భారతి, మహమ్మద్ జాఫర్, గోపగాని రాజు, నాయకులు మున్నా, సుదర్శన్ కోరి, సిహెచ్ రమేష్, ఇమామ్, గౌస్, నయీమ్, ముస్లిం కులస్తులు పాల్గొన్నారు.

## వార్డు కౌన్సిలర్ ను సన్మానించిన ప్లేయింగ్ లెవెన్ క్రీడాకారులు



**ఇల్లందు, మార్చి, 17, ప్రజాజ్యోతి:** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మూడవ వార్డు నుండి అత్యధిక మెజారిటీతో ఘనవిజయం సాధించిన కౌన్సిలర్ అజ్మీర వంశీ ని మంగళవారం ప్లేయింగ్ లెవెన్ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అజ్మీర వంశీ సాధించిన విజయం యువతకు ప్రేరణగా నిలుస్తుందని క్రీడాకారులు పేర్కొన్నారు. క్రీడల ద్వారా వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, ఆరోగ్యవంతమైన జీవన విధానం సాధ్యమవుతుందని, అందుకు యువత ముందుండాలని కౌన్సిలర్ అజ్మీర వంశీ సూచించారు. యువతను ప్రోత్సహించేందుకు తాను ఎల్లవేళలా ముందుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్లేయింగ్ లెవెన్ సభ్యులు, పలువురు క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆటో,లారీ ఢీకొని యువకుడు మృతి

- ఏడుళ్ల బయ్యారం గ్రామంలో విషాదం
- అజాగ్రత్త డ్రైవింగ్ కారణమని ఆరోపణ



**పినపాక,మార్చి 17(ప్రజాజ్యోతి ):** ఏడుళ్ల బయ్యారం గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం, మధ్యాహ్నం సుమారు 1:30 గంటల సమయంలో ఆటో మరియు లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న యువకుడు మద్రి సంజయ్ (ఎల్చిరెడ్డిపల్లి గ్రామ నివాసి) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం తీవ్రతకు ఆటో పూర్తిగా దెబ్బతింది.లారీ డ్రైవర్ అజాగ్రత్తగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుని మేనమామ మద్దెబోయిన జంపయ్య ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. స్థానికులు రోడ్డు భద్రతపై అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం వితరణ




**ఇల్లందు, మార్చి 17, ప్రజాజ్యోతి:** మండలంలోని కొల్లాపురం గ్రామానికి చెందిన ఓకే కుటుంబానికి చెందిన ఇరువురు గత నెల 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారి దశదిన కార్యక్రమానికి ఆదివాసి జేఏసీ జిల్లా కన్వీనర్ పెండేకట్ల యాకయ్య సూచనల మేరకు మంగళవారం హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ మా కుటుంబానికి 25 కేజీల బియ్యాన్ని వితరణగా అందజేశారు. మానవత దృక్పథంతో బాధితుల కుటుంబానికి 25 కేజీల బియ్యాన్ని వితరణగా అందజేసిన హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణకు పెండేకట్ల యాకయ్య ధన్యవాదాలు తెలిపారు.

- ప్రజాజ్యోతి కథనం అక్షర సత్యమని ప్రజల అభిప్రాయం
- పంచాయతీల్లో అధికార దుర్వినియోగంపై కొత్త ఆరోపణలు
- కార్యదర్శులపై ఒత్తిడి... స్థానిక వర్గాల్లో ఆందోళనలు
- పనులు లేకపోయినా బిల్లులు అన్న గ్రామస్థుల వాదనలు
- ఫోటోలు, జీపీఎస్ వివరాల్లో గందరగోళంపై సందేహాలు



# షాడో సర్పంచ్.. నీడలోనే పాలన..!

పాల్వంచ మండలంలోని గ్రామపంచాయతీలలో 'బినామీ సర్పంచ్' వ్యవస్థపై ప్రజా జ్యోతి వెలుగులోకి తెచ్చిన **"కుర్చీ ఆమెదే... పెత్తనం ఆయనది"** కథనం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ కథనాన్ని ప్రజలు "అక్షర సత్యం"గా అభివర్ణిస్తుండగా, తాజా పరిణామాలు ఆ ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. సర్పంచ్‌ల పేరుతో అధికారాలు వినియోగిస్తున్న **'సర్పంచ్ పతులు'** గ్రామ పరిపాలనను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారనే విమర్శలు ముదురుతున్నాయి.

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి / పాల్వంచ, ప్రజాజ్యోతి

గ్రామాల్లో చిన్న పనుల నుంచి కీలక నిర్ణయాల వరకూ అన్నింటిలోనూ వారి జోక్యం పెరుగుతోందని స్థానిక వర్గాలు అంటున్నాయి.

### ››› కార్యదర్శులపై ఒత్తిడి... విధుల్లో స్వేచ్ఛ లేకపోవడమా?

మండలంలోని కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు స్వతంత్రంగా పనిచేయలేకపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అభివృద్ధి పనుల నమోదు, బిల్లుల ఆమోదం వంటి అంశాల్లో నిబంధనలు పక్కన పెట్టి నిర్ణయాలు తీసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారనే సమాచారం బయటకు వస్తోంది.
దీంతో కొందరు కార్యదర్శులు ఇబ్బందులు ఎదుర్కొంటూ, బదిలీ కోరుకున్న ఘటనలు కూడా చోటుచేసుకున్నట్లు తెలిసింది.

### ››› పనులు కనిపించవు... బిల్లులు మాత్రం వరుస!

గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో జరగకపోయినా, కాగితాలపై మాత్రం "పూర్తయ్యాయి"గా చూపించి బిల్లులు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.
కొన్నిచోట్ల పాత పనులనే కొత్తగా చూపిస్తూ మళ్లీ బిల్లులు పొందుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా ధనం వినియోగంపై ఇది పెద్ద ప్రశ్నగా మారింది.

### ››› ఫోటోలు, జీపీఎస్‌లో 'గోల్‌మాల్'?

పంచాయతీ పనుల ధృవీకరణ ప్రక్రియలో కూడా గందరగోళం నెలకొన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. పని జరగకపోయినా ఫోటోలు అప్‌లోడ్ చేసి పనులు పూర్తయ్యాయని చూపుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
జీపీఎస్ ఆధారిత ఫోటోలలో పని జరిగిన ప్రదేశానికి భిన్నమైన లొకేషన్‌లు కనిపించడం మరింత సందేహాలకు తావిస్తోంది.

### ››› చెక్కులపై ఎవరి నియంత్రణ?

పంచాయతీ నిధుల వినియోగంలో సర్పంచ్ సంతకం కీలకం అయినప్పటికీ, వాస్తవానికి చెక్కుల జారీ, డబ్బుల ఉపసంహరణ వంటి ప్రక్రియలపై ఇతరుల ప్రభావం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
కొన్నిచోట్ల సర్పంచ్ కుటుంబ సభ్యులే ఆర్థిక వ్యవహారాలను పూర్తిగా నియంత్రిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ››› సన్నిహితుల ఖాతాల్లోకి నిధుల మళ్లింపు?

అభివృద్ధి పనుల పేరిట విడుదలైన నిధులు, సర్పంచ్‌కు సన్నిహితులైన వ్యక్తుల ఖాతాలకు మళ్లుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు పూర్తిగా జరగకపోయినా బిల్లులు క్లియర్ చేసి డబ్బులు తీసుకుంటున్నారనే అనుమానాలు గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు.

### ››› రికార్డులు ఒకలా... వాస్తవం మరోలా?

పంచాయతీ రికార్డుల్లో చూపిస్తున్న ఖర్చులు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పనులు మధ్య విరుద్ధతలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. పత్రాల ప్రకారం పనులు పూర్తయినట్లు చూపించినా, వాస్తవంగా అవి జరగకపోవడం ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది.

### ››› గ్రామాల్లో అసంతృప్తి ఉవ్వెత్తున

ఈ పరిణామాలపై గ్రామస్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల స్థానంలో ఇతరులు వ్యవహరించడం వల్ల గ్రామస్థాయి ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతింటోందని మండిపడుతున్నారు. మహిళా రిజర్వేషన్ లక్ష్యం కేవలం కాగితాలకే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### ››› అధికారుల మౌనం... మరింత అనుమానాలకు తావు

ఇన్ని ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారుల నుంచి స్పష్టమైన స్పందన రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. వెంటనే సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తేవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గ్రామపంచాయతీలలో పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన అమలు చేయాలని కోరుతున్నారు.

---

# తోగ్గూడెం అక్రమ మైనింగ్ వ్యవహారంపై విచారణ జరపాలి

- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి17, ప్రజా జ్యోతి:** పాల్వంచ మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామంలో జరిగిన అక్రమ మైనింగ్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం పాల్వంచ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తోగ్గూడెం గ్రామంలో అనేక సంవత్సరాలుగా సుమారు 10 క్వారీలు , 7 నుండి 8 క్రషింగ్ మిల్లులు నడుస్తున్నాయని , ఈ క్వారీలు అమాయక గిరిజనులను అడ్డం పెట్టుకొని ప్రభుత్వం నుండి అనుమతులు పొంది కొందరు దళారులు వందల కోట్ల రూపాయల అక్రమ మైనింగ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ మైనింగ్ అంశంపై బిజెపి గత నాలుగు సంవత్సరాలుగా జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు చేస్తూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు, ఈ క్రమంలో గనుల శాఖ నిర్వహించిన ఈ టి ఎస్ సర్వేలో తోగ్గూడెం ప్రాంతంలో సుమారు 50 లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా అక్రమ తవ్వకాలు జరిగినట్లు అధికార రికార్డులు వెల్లడిస్తున్నాయని మైన్స్ అండ్ జియాలజీ శాఖ విడుదల చేసిన అధికారిక వివరాల ప్రకారం తోగ్గూడెం ప్రాంతంలోని పలువురు క్వారీ లీజ్ హోల్డర్లపై ప్రభుత్వం సుమారు రూ.300 కోట్లకు పైగా డిమాండ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అయితే ఈ భారీ జరిమానాలను చెల్లించకుండా కొన్ని క్వారీలు రోజువారీగా అక్రమంగా తవ్వకాలు కొనసాగిస్తూ క్రషింగ్ మిల్లులు నడుపుతున్నాయని అన్నారు, సంవత్సరాలుగా అక్రమంగా ఖనిజాన్ని తవ్వడంతో ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయ నష్టం జరుగుతోందని తెలిపారు. అక్రమంగా తవ్విన ఖనిజాలపై సెయినియరేజ్ ఫీజు , భారీ పెనాల్టీలు విధించినప్పటికీ కొందరు క్వారీ యజమానులు ఇప్పటికీ ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించకపోవడం ఆశ్చకరమని అన్నారు. ఈ వ్యవహారం వెనుక ఎవరెవరి ప్రమేయం ఉందో ప్రభుత్వం తేల్చాలని డిమాండ్ చేశారు. తోగ్గూడెం ప్రాంతంలో అక్రమ మైనింగ్ కారణంగా ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల నష్టం మాత్రమే కాకుండా పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ,మైన్స్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే ఈ వ్యవహారంపై ప్రత్యేక విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వానికి రావలసిన బకాయిలను వెంటనే వసూలు చేయాలని, ఇన్ని సంవత్సరాలుగా కోట్ల రూపాయల అక్రమ మైనింగ్ చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అక్రమంగా నడుస్తున్న క్వారీలు , క్రషింగ్ మిల్లుల అనుమతులను రద్దు చేసి ప్రజల అవసరాల నిమిత్తం ఆ ప్రాంత గిరిజనులకే కొత్త అనుమతులు ఇచ్చి మైనింగ్ నిబంధనల ప్రకారం కంకర సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ రూ.300 కోట్ల విలువైన అక్రమ మైనింగ్ జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే భారతీయ జనతా పార్టీ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. కోట్ల రూపాయల అక్రమ మైనింగ్ వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ , ఇతర కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేయడమే కాకుండా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలు చేస్తామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి నోముల రమేష్,గోడుడు శ్రీధర్,విద్యాసాగర్ (కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు ),కాల్వ ప్రసాద్,శ్రీనివాస్, మాదారపు లక్ష్మణ్,లింగగిరి వెంకట్రామయ్య ,భూక్య మోహన్,భూక్య ఆశ ,కోటేశ్వరావు,పవన్,కొత్తపల్లి విజయ్,బానోత్ బాలాజీ లు పాల్గొన్నారు



## జిన్నెలగూడెంలో 'టాపర్' మొక్కజొన్న క్షేత్ర ప్రదర్శన రైతుల హర్షం



**ఆళ్ళపల్లి.మార్చి17.ప్రజా జ్యోతి** ఆళ్ళపల్లి మండల పరిధిలో మర్కోడు గ్రామ పరిధిలోని జిన్నెలగూడెంలో( జిన్‌ఎక్స్) సీడ్స్ వారి 'టాపర్' మొక్కజొన్న రకంపై నిర్వహించిన రైతు ప్రదక్షణ క్షేత్రం విజయవంతమైంది. రైతు కొర్స మల్లయ్య సాగు చేసిన ఈ పంటను చూసేందుకు వందలాది మంది రైతులు తరలివచ్చారు. టాపర్ రకం కంకులు పొడవుగా, లావుగా ఉండి, గింజలు బలంగా ఉండటంతో అధిక దిగుబడి వస్తుందని రైతులు నమ్మకం వ్యక్తం చేశారు. గత 3–4 ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఈ రకాన్ని సాగు చేస్తున్నామని, ప్రతి ఏటా మంచి లాభాలు వస్తున్నాయని రైతులు తెలిపారు.పంటను విజయవంతంగా పండించిన రైతు మల్లయ్య దంపతులను డీలర్లు శాలువాతో ఘనంగా సత్కరించారు. కంపెనీ ప్రతినిధి (యజమాన్యం) శ్రీపాల్ రెడ్డి మర్కోడు గ్రామ సర్పంచ్.సుతారి రమాదేవి. వ్యాపారవేత్తలు.వెలిశాల కార్తీక్. అనుమోల వెంకటేశ్వరరావు ఆదర్శ రైతుకొర్స మల్లయ్య. పడిగ సమ్మయ్య, కంపెనీ సిబ్బంది బానోత్ జితేందర్, రాయుడు, రఘు, రాకేష్ మరియు సుమారు 500 మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.రైతు కష్టపడి సాగు చేసిన పంట ఆశించిన రీతిలో దిగుబడి వచ్చినప్పుడే అసలైన ఆనందం కలుగుతుంది. కంపెనీ ప్రతినిధి శ్రీపాల్ రెడ్డి,అన్నారు.

## ఎన్నికల హామీలు వెంటనే నెరవేర్చాలి

- **బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం**



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 17, ప్రజా జ్యోతి:**మంగళవారం తెలంగాణ రాష్ట్ర బీజేపీ పార్టీ పిలుపుమేరకు జిల్లా అధ్యక్షుల ఆదేశాలతో అన్నపురెడ్డిపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు జుబ్బురు రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు జుబ్బురు రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, రైతు భరోసా అందిస్తామని, మహిళలకు ప్రతి నెల రూ.2500 ఇస్తామని, జాబ్ క్యాలెండర్ ఏర్పాటు చేసి ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అలాగే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద తులం బంగారం ఇస్తామని, వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పింఛన్లను పెంచుతామని, కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ఇలా మొత్తం 420 హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా ఇప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని భారతీయ జనతా పార్టీ ప్రజల తరఫున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జటంగి కృష్ణ, బాల కిరణ్ శర్మ, మండల నాయకులు నాగళ్ళ నరసింహారావు, సైదులు, వెంకటేశ్వరరావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లిలో బ్యాంక్ మిత్రగా పూడూరి నాగ వెంకటలక్ష్మికి బాధ్యతలు

- **బాలాజీ నగర్‌లో బాధ్యతల అప్పగింత కార్యక్రమం**

**అన్నపురెడ్డిపల్లి, మార్చి 17, ప్రజా జ్యోతి:**అన్నపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన పూడూరి నాగ వెంకటలక్ష్మికి మంగళవారం బ్యాంక్ మిత్రగా బాధ్యతలు అప్పగించారు. గ్రామంలోని బాలాజీ నగర్‌లో ఉన్న ఆమె స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో ఐరాక్స్ చైర్మన్ సురేష్ ఆధ్వర్యంలో, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ సమక్షంలో పూడూరి నాగ వెంకటలక్ష్మికి బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు సులభంగా అందించాలనే ఉద్దేశంతో బ్యాంక్ మిత్ర సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు చిన్నచిన్న బ్యాంకింగ్ అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే సేవలు పొందవచ్చని పేర్కొన్నారు.పూడూరి నాగ వెంకటలక్ష్మి మాట్లాడుతూ తనను అన్నపురెడ్డిపల్లి గ్రామానికి బ్యాంక్ మిత్రగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ ద్వారా పింఛన్లు పొందడం, నగదు జమ చేయడం, నగదు తీసుకోవడం వంటి బ్యాంకింగ్ లావాదేవీలు గ్రామంలోనే చేసుకోవచ్చని తెలిపారు. ప్రజలకు అందుబాటులో మెరుగైన సేవలు అందించేందుకు తాను కృషి చేస్తానని చెప్పారు.
ఈ కార్యక్రమంలో సుగ్గల నరసింహారావు, చల్లా రమేష్, బిల్లు సత్యనారాయణ, సిఎస్‌పి బ్యాంక్ మిత్రలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## శ్రీనివాసగిరి బ్రహ్మోత్సవాల్లో రథోత్సవం వైభవంగా నిర్వహణ





**పాల్వంచ, మార్చి 10, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణంలోని శ్రీనివాస కాలనీలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళ్యాణోత్సవ విగ్రహాలను కొండపై నుంచి మెట్ల మార్గం ద్వారా పాదాల మండపం వద్దకు తీసుకువచ్చి, ఆలయ ప్రధాన అర్చకులు నగేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టువస్త్రాలు, పూలమాలతో అలంకరించిన స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా సిద్ధం చేసిన రథంపై ప్రతిష్ఠించారు.భక్తులు "గోవిందా గోవిందా" నామస్మరణతో రథయాత్రలో పాల్గొని భక్తి భావాన్ని చాటుకున్నారు. శ్రీనివాసగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి సేవ ట్రస్ట్ చైర్మన్ కొత్త వెంకటేశ్వరరావు, కో–చైర్మన్ డా. మందడపు ముక్కంటేశ్వరరావు, అధ్యక్షుడు డా. బిక్కసాని సుధాకర్‌రావు తదితరులు రథానికి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు.రథయాత్ర ఆలయం నుంచి దమ్మపేట సెంటర్, అంబేడ్కర్ సెంటర్, నటరాజ్ సెంటర్, శాస్త్రి రోడ్, బీసీఎం రోడ్ మార్గాల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. రథయాత్రలో లక్ష్మి కోలాటం, కేరళ సంప్రదాయ వాయిద్యాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రత్యేకంగా రూపొందించిన స్వామి, అమ్మవారి రూపాలు, ఏనుగు అంబారీలు భక్తులను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఆరుట్ల లక్ష్మణాదారి, భక్త



సమాజ మండలి ప్రతినిధులు, మహిళా సంఘ సభ్యులు, సేవాదళ్ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- **గుండాల మండలంలో కలకలం**





**గుండాల, మార్చి 17 (ప్రజాజ్యోతి):**గుండాల మండల కేంద్రంలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మాదాల వెంకన్న (55) గత నాలుగు రోజులుగా అదృశ్యమయ్యాడు. ఈ నెల 14న మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గమనించారు. సాయంత్రం నుంచి బంధువులు, పరిసర గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు.మంగళవారం ఉదయం ఇంటి సమీపంలోని మొక్కజొన్న చేనులో వెంకన్న మృతదేహం కనబడడంతో కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటంతో అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.సమాచారం అందుకున్న గుండాల సీఐ తిరుపతి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహం కుళ్లిన పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఇల్లందు నుంచి పోస్టుమార్టం సిబ్బందిని రప్పించి అక్కడికక్కడే పోస్టుమార్టం నిర్వహించారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు గుండాల పోలీసులు తెలిపారు.

## లోపాలు వెంటనే సరిచేయాలి

- **లేకపోతే కఠిన చర్యలు: కలెక్టర్ అంకిత్**



**గుండాల, మార్చి 17 (ప్రజాజ్యోతి):**పాఠశాలల్లో ఉన్న లోపాలను రెండు రోజుల్లోగా పూర్తిగా సరిచేయాలని, లేనిపక్షంలో గుర్తింపు రద్దుతో పాటు బ్లాక్‌లిస్ట్‌లో చేర్చే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అంకిత్ హెచ్చరించారు.మంగళవారం గుండాల మండలం ముక్తాపురంలోని ఏకలవ్య పాఠశాలను సందర్శించిన కలెక్టర్, అక్కడి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆహారం నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలు లోపాలపై సిబ్బందిని తీవ్రంగా హెచ్చరించారు. ప్రతి భోజనం తాజాగానే వడ్డించాలని ఆదేశించారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, వైద్య సేవల్లో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. మందుల నిల్వ, సిబ్బంది అందుబాటు, అత్యవసర సేవలపై పలు సూచనలు చేశారు.కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్ పనిచేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసి, వెంటనే వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. తాసిల్దార్ కార్యాలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.ప్రజలకు సేవలందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖాసీం, ఎంపీడీవో బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింల స్మశాన వాటికలో పందులను నిర్మూలించాలి

- **జిల్లా కలెక్టర్, మేయర్‌లకు ఫిర్యాదు**

**పాల్వంచ, మార్చి 17, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణంలోని నటరాజ్ సెంటర్‌లో ఉన్న ముస్లింల స్మశాన వాటికలో పందుల సంచారం పెరగడం, అక్కడే పందులను కాల్చడం, కోయడం మరియు మాంసం విక్రయించడం జరుగుతున్న నేపథ్యంలో మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. యాకూబ్ పాషా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై మంగళవారం జిల్లా కలెక్టర్ మరియు మేయర్‌లకు ఆయన ఫిర్యాదు చేశారు. ప్రతి శుక్రవారం అలాగే రంజాన్, బక్రీద్ వంటి పవిత్ర పండుగల సందర్భంగా కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి పుష్పాంజలి ఘటించి ప్రార్థనలు చేయడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు.అయితే కొంతమంది పందుల పెంపకదారులు తమ వ్యాపార కార్యకలాపాల కోసం ఈ స్మశాన వాటికను ఉపయోగించుకోవడంతో ముస్లింల మనోభావాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 21న జరగనున్న పవిత్ర రంజాన్ పర్వదినాన్ని దృష్ టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి పం దుల పెంపకదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, స్మశాన వాటికను రక్షించే చర్యలు చేపట్టి ముస్లింల మనోభావాలను కాపాడాలని జిల్లా కలెక్టర్ మరియు మేయర్‌లను యాకూబ్ పాషా కోరారు.

# భద్రగిరి మార్ట్ విజయవంతానికి వ్యాపారుల సహకారం అవసరం: ఐటీడీఏ పీఓ రాహుల్

**భద్రాచలం, మార్చి 17, ప్రజాజ్యోతి:** గిరిజన రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, చిన్నతరహా పరిశ్రమలు నిర్వహిస్తున్న గిరిజన కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు ప్రారంభిస్తున్న 'భద్రగిరి మార్ట్' అభివృద్ధికి భద్రాచలం పట్టణ వ్యాపారులు తమ వంతు సహకారం అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. మంగళవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో భద్రాచలం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఆయన, భద్రగిరి



మార్ట్‌లో ఆర్గానిక్ నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు అందుబాటులో ఉంచేలా సహకరించాలని కోరారు. ప్రజలు రోజువారీగా వినియోగించే సరుకుల జాబితాను వ్యాపారులకు అందజేసి, నాణ్యమైన ఉత్పత్తులను సరఫరా చేయాలని సూచించారు. ఇప్పటికే స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేస్తున్న ఆహార పదార్థాలు, గిరిజన రైతులు పండించే వివిధ రకాల బియ్యం, పప్పు దినుసులను పరిశీలించినట్లు తెలిపారు. రాబోయే శ్రీరామనవమి సందర్భంగా భద్రగిరి మార్ట్‌ను ప్రారంభించనున్నామని, దీన్ని విజయవంతంగా నడిపేందుకు వ్యాపారుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ మధుకర్, ఏవో సున్నం రాంబాబు, పీవీటీజీ అధికారి గన్యా, ఏపీవో వేణు, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, జేడీఎం హరికృష్ణ, డీఎస్ఓ ప్రభాకర్ రావు, మేనేజర్ ఆదినారాయణతో పాటు వ్యాపారులు పాల్గొన్నారు.

## రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

- వ్యవసాయ అధికారి అరుణ్ కుమార్



**ములకలపల్లి, మార్చి 17 ప్రజాజ్యోతి:** మండలంలోని రైతులు యాసంగి పంటకు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం మండల వ్యవసాయ అధికారి అరుణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2026 ఫిబ్రవరి 28 వరకు కొత్త పట్టాదార్ పాస్‌బుక్ పొందిన రైతులు, ఇప్పటి వరకు బ్యాంకు వివరాలు నమోదు చేసుకొని రైతులు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే రైతులు రైతు భరోసా అప్లికేషన్ ఫారం, పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీ, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ ప్రతితో పాటు మొబైల్ నంబర్ తో. సమీపంలోని రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని సూచించారు. రైతు భరోసా కింద బ్యాంకు ఖాతాలో నిధులు అందుకుంటున్న రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. బ్యాంక్ ఖాతా వివరాలు మార్చుకోవాలనుకునే రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన రైతులు మార్చి 25 లోపు వివరాలు నమోదు చేసుకుని పథకం ప్రయోజనం పొందాలని మండల వ్యవసాయ అధికారి అరుణ్ కుమార్ కోరారు.

## గ్రామీణాభివృద్ధికి మౌలిక వసతులే కీలకం: డీఆర్‌డీఓ విద్యా చందన



**ములకలపల్లి, మార్చి 17 ప్రజాజ్యోతి:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మౌలిక వసతుల విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) విద్యా చందన అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో ములకలపల్లి మండలం పాతగంగారం గ్రామపంచాయతీ పరిధిలోని జగన్నాథపురం గ్రామాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రైన్‌లు, సోక్‌పిట్‌ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టి, వాటి పురోగతిని సమీక్షించారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, వర్షపు నీటి నిల్వలను నివారించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించవచ్చని ఆమె తెలిపారు. పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జగన్నాథపురం గ్రామంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకుని, రుణాల వినియోగం, ఆదాయ వృద్ధి మార్గాలపై మార్గదర్శకాలు అందించారు. మహిళల ఆర్థిక సాధికారతలో సంఘాల పాత్ర ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ హుస్సేన్,ఏపీఎం రాంకుమార్, కార్యదర్శి ఇబ్రహీం, వార్డు సభ్యులు పిడియాల వెంకటేశ్వర్లు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మర్రిగూడెంలో క్షయ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరం

- 32 మందికి ఛాతి చిత్ర పరీక్షలు... ఇద్దరికి క్షయ అనుమానం



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 17, ప్రజా జ్యోతి:** భారతదేశాన్ని క్షయ వ్యాధి రహిత దేశంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా అన్నపురెడ్డిపల్లి మండలం మర్రిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ సృజన, ఉప సర్పంచ్ కాటం రాజు ప్రారంభించారు. ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఆధునిక మొబైల్ ఛాతి చిత్ర యంత్రం ద్వారా గ్రామపంచాయతీ పరిధిలో మొత్తం 32 మందికి పరీక్షలు నిర్వహించారు. అందులో ఇద్దరికి క్షయ వ్యాధి ప్రాథమిక లక్షణాలు ఉన్నట్లు గుర్తించినట్లు డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెండు వారాలకు పైగా తగ్గని దగ్గు, సాయంత్రం వేళల్లో స్వల్ప జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం, దగ్గినప్పుడు కఫంలో రక్తం కనిపించడం లేదా ఛాతిలో నొప్పి రావడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. అనుమానిత లక్షణాలు ఉన్న వారికి కఫం మరియు రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం తరపున ఉచితంగా చికిత్సతో పాటు మందులు అందజేస్తామని తెలిపారు. అలాగే ప్రభుత్వం ద్వారా పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.1000 ఆర్థిక సహాయం కూడా అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సృజన, ఉప సర్పంచ్ కాటం రాజు, వైద్యురాలు ప్రియాంక, వైద్య సిబ్బంది ప్రకాశరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలాజీ, క్షయ వ్యాధి పర్యవేక్షకుడు వెంకట్, ఛాతి చిత్ర యంత్ర నిపుణుడు సాయి కృష్ణ, ఏఎన్ఎంలు సుశీల, జయలక్ష్మి , ఆశా కార్యకర్త సునీత తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ సమరభేరి

- తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత



**ఆళ్ళపల్లి.మార్చి17.ప్రజాజ్యోతి** నేటి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శిస్తూ, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో మంగళవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆళ్ళపల్లి మండల తహశీల్దార్ కార్యాలయం అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. బీజేపీ నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు.అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని మండిపడ్డారు.రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో అందడం లేదని ఆరోపించారు. మండల పరిధిలోని పెండింగ్‌లో ఉన్న సమస్యలు, సాగునీటి వసతులు ఇతర మౌలిక సదుపాయాలను వెంటనే మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఇస్తామన్న భృతి. ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో స్పష్టత లేకపోవడాన్ని తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు,తాటికొండ శ్రీనివాసచారి ప్రధాన కార్యదర్శులు. ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## చర్మకారుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం



- షాపింగ్ కాంప్లెక్స్ పూర్తి చేసి షాపులు కేటాయించాలంటూ విజ్ఞప్తి

**కొత్తగూడెం, మార్చి 17 ( ప్రజాజ్యోతి )** కొత్తగూడెం పట్టణంలో చర్మకారుల కోసం నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ ను త్వరగా పూర్తి చేసి షాపులు కేటాయించాలని చర్మకారుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షురాలు దేవి ప్రసన్న, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్, 58వ డివిజన్ కార్పొరేటర్ మొహమ్మద్ దావూద్ లకు వినతిపత్రం అందజేశారు. చర్మకారులు తెలిపిన వివరాల ప్రకారం గత 30 సంవత్సరాలుగా చెప్పుల కుట్టు వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని తెలిపారు. సుమారు 20 సంవత్సరాల క్రితం మున్సిపాలిటీ వారు శివనేన్స్ ఎదుట 26 షాపులు నిర్మించినప్పటికీ, అవి శిథిలావస్థకు చేరుకోవడంతో ఉపయోగించుకోలేకపోయామని చెప్పారు. ప్రస్తుతం జీవనోపాధి కోసం రోడ్ల పక్కన తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే ప్రస్తుత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కూడా కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.



అందువల్ల అధికారులు తక్షణమే స్పందించి, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని పూర్తి చేసి, అర్హులైన చర్మకారులకు షాపులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో చర్మకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చదలవాడ సూరి, గౌరవ అధ్యక్షుడు సత్తాల ఎంకన్న, పెద్దపూడి రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దపూడి నాగేంద్రబాబు, సభ్యులు ఆముదాల ప్రసాద్, గడ్డపారుల శ్రీను, అంబాల శ్రీను, జైదా ఎంకన్న, చుట్టుగుళ్ళ రాంబాబు, చుట్టుకుల నాగరాజు, ఆముదాల రాజేష్, మొగిలి పాక మురళీకృష్ణ, సీతారాములు, కుసపాటి నర్సింగ్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.